ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్
5
శనివారం 27 జనవరి 2024
జిల్లాల వార్తలు





మెదక్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా



గౌరవవందనం స్వీకరిస్తున్న మెదక్ కలెక్టర్ రాజర్షిషా, పక్కన ఎస్పీ బాలస్వామి

అర్హులకు ఆరు గ్యారంటీలు

- ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాం
- 2.75 లక్షల దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్ చేశాం
- అభివృద్ధి కార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగుతాయి
- రిపబ్లిక్ వేడుకల్లో మెదక్ కలెక్టర్ రాజర్షిషా

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, మెదక్, జనవరి 26 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఆరు గ్యారంటీ పథకాలను అందించడమే ధ్యేయంగా పనిచేస్తుందని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. మెదక్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ రాజర్షిషా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగమన్నారు. ప్రతీ ఒక్కరికి స్వాతంత్ర ఫలాలు అందాలన్నదే రాజ్యాంగ లక్ష్యమన్నారు. ఎందరో మహనీయులు ప్రాణ త్యాగాల వల్లనే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని చెప్పారు. ప్రజలకు స్వేచ్ఛావాయువులను అందించిన మహనీయులను ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో మెదక్ జిల్లా ముందంజలో ఉందని కలెక్టర్ అన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అందిస్తున్న సహకారం మరిచిపోలేనిదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలను నిర్విఘ్నంగా అమలు చేస్తామన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

అట్టడుగు వర్గాలకు పథకాలు అందించడమే లక్ష్యం

ఆరు గ్యారంటీల ద్వారా ప్రజలకు మేలు చేకుర్చాలన్నదే ధ్యేయమని కలెక్టర్ తెలిపారు. అట్టడుగు వర్గాల ప్రజలకు పథకాలు అందినప్పుడే ప్రభుత్వం లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు. ఇప్పటికే మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేయడానికి ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామన్నారు. ప్రజల నుంచి వచ్చిన 2.75 లక్షల దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్ చేశామని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. అర్హులైన మహిళలకు నెలకు రూ. 2500 ఆర్థిక సహాయం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. రైతుల కళ్లల్లో ఆనందం చూడటానికి ప్రభుత్వం రైతు భరోసా పేరిట ఎకరాకు ప్రతి యేటా రూ. 15 వేలు, కౌలు రైతులకు రూ.12వేలే అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. వీటితో పాటు ఇందిరమ్మ పథకం కింద ఇల్లు లేని పేదలకు ఆర్థిక సహాయం, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, వరికి మద్దతు ధర, రాజీవ్ ఆరోగ్య శ్రీ కింద పేదలకు రూ. 10 లక్షల వరకు ఉచిత వైద్యం వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, అదనపు కలెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లు, ఎస్పీ బాలస్వామి, జిల్లా జడ్జ్ లక్ష్మీశారద తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ప్రదర్శన

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మెదక్ అర్బన్, జనవరి 26 : జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. సిద్దార్థ, గీతా, జడ్పీహెచ్‌హెచ్ ఘణపూర్, టేక్మాల్ మోడల్ స్కూల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు చూపరులను కట్టిపడేసింది. బాలబాలికలు ఏకరూప దుస్తులు ధరించి తమ అభినయంతో అలరింపజేశారు. అలాగే పోలీసుల పరేడ్ కనువిందు చేసింది. సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు.

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన

గణతంత్ర దినోత్సవం సందర్భంగా మైదానంలో వివిధ పథకాలపై నిర్వహించిన శకటాల ప్రదర్శన అందిరినీ ఆకట్టుకున్నది. జిల్లా పంచాయతీ శాఖ ఆరు గ్యారంటీలపై, గ్రామీణాభివృద్ధి శాఖ ప్లాస్టిక్ రహిత వాతావరణం, వైద్య ఆరోగ్యశాఖ రాజీవ్ ఆరోగ్యశ్రీ, అటవీశాఖ పోచారం అభయారణ్యంలో పక్షి జాతులు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా యుజవన, క్రీడల శాఖ వృత్తి నైపుణ్యం, స్వీప్ ఆధ్వర్యంలో ఓటర్ల చైతన్యం వంటి పథకాలపై అవగాహన కల్పిస్తూ శకటాలను ప్రదర్శించారు. అంతకుముందు స్వాతంత్ర్య సమరయోధులను కలెక్టర్ రాజర్షిషా, జడ్పీ చైర్మన్ హేమలత, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, ఎస్పీ డా.బాలస్వామి, అదనపు కలెక్టర్లు వేంకటేశ్వర్లు, రమేష్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మహేందర్, మున్సిపల్‌చైర్మన్ చంద్రపాల్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పంచాయతీ శాఖ ఆరు గ్యారంటీలపై ఏర్పాటు చేసిన శకటం

గ్యారంటీల అమలుకు అడుగులు

- 'ప్రజాపాలన'లో 3,91,565 దరఖాస్తుల స్వీకరణ
- పథకాలను అమలు చేసేలా ప్రభుత్వం కార్యాచరణ
- సుపరిపాలన అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ వల్లూరు క్రాంతి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 26 : ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు దిశగా అడుగులు వేస్తున్నదని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. 75 గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం సంగారెడ్డిలోని పోలీస్ పరేడ్ మైదానంలో కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలనుద్దేశించి క్రాంతి మాట్లాడుతూ మహాలక్ష్మీ, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూత పథకాలను అమలు చేస్తామని ప్రభుత్వం ప్రజలకు హామీ ఇచ్చిందన్నారు. ఈ ఆరు గ్యారంటీలలో ఇప్పటికే రెండింటిని అమలు చేయడం జరిగిందన్నారు. ఇందులో మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. జిల్లాలోని అన్నీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలో రోజూ సుమారు 51 వేల మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారని తెలిపారు. పథకం ప్రారంభమైన గత నెల 9 నుంచి ఇప్పటివరకు 24 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకున్నారని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న వారిలో 57 శాతం మహిళలేనని, ఇది మహిళ సాధికారితకు నిదర్శనమని పేర్కొనవచ్చన్నారు.



ఆరోగ్యశ్రీలో రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం

ప్రభుత్వం పేదల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని కలెక్టర్ క్రాంతి తెలిపారు. ఏ పేద వాడు డబ్బు లేదన్న కారణంతో వైద్యం అందక ప్రాణాలు పోగొట్టుకోకూడదన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అందుకే పెరిగిన వైద్య ఖర్చులకు తగ్గట్టుగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో అందుతున్న వైద్యసేవలను రూ.ఐదు నుంచి రూ.10 లక్షల వరకు పెంచామని కలెక్టర్ తెలిపారు. ఇక మిగిలిన నాలుగు గ్యారంటీల అమలుకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించిన విషయం తెలిసిందేనన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రజల నుంచి 3,91,565 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటన్నింటినీ ఆన్‌లైన్ చేయడం జరిగిందన్నారు. ఈ దరఖాస్తుల ఆధారంగా పూర్తి స్థాయిలో పరిశీలించి అర్హులైన వారికి ఆయా పథకాలను అమలు చేసేలా ప్రభుత్వం కార్యాచరణకు కృషి చేస్తుందని కలెక్టర్ క్రాంతి తెలిపారు.



సంగారెడ్డిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

ప్రజా సమస్యల సత్వర పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

జిల్లా ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని కలెక్టర్ క్రాంతి అన్నారు. ఇందులో భాగంగా విద్య, వైద్యం, వసతి గృహాల్లో మౌలిక సౌకర్యాల కల్పన, మహిళా శిశు సంక్షేమం, తాగునీరు, పారిశుధ్యం, పట్టణ సుందరీకరణ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. అలాగే జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రభుత్వం అత్యంత కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, అర్హులైన లబ్ధిదారులకు చేరేలా నిబద్ధత, సమన్వయంతో పని చేద్దామని కలెక్టర్ క్రాంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ పట్లోళ్ల మంజుశ్రీజైపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, ఎస్పీ రూపేష్, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కలెక్టర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు.



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి

విద్యార్థుల నృత్య ప్రదర్శన





గణతంత్ర వేడుకల్లో ప్రదర్శించిన ఆర్టీసీ శకటం

ప్రత్యేక ఆకర్షణగా శకటాల ప్రదర్శన

సంగారెడ్డి టౌన్, జనవరి 26 : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలకు చెందిన శకటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉచిత బస్సు సౌకర్యం, ప్రజాపాలన, వైద్య ఆరోగ్య శాఖ, గ్రామపంచాయతీ, డీఆర్డీవో, 108, వ్యవసాయ తదితర శాఖలకు చెందిన శకటాలను ప్రదర్శించారు. పాఠశాలల విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కాసాల జిల్లా పరషత్, చిట్కుల్ గురుకుల పాఠశాల, సంగారెడ్డిలోని శ్రద్ధ ఉన్నత పాఠశాల, గంగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రిషీ పబ్లిక్ స్కూల్, సదాశివపేట ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులతో పాటు సబిత కేంద్రానికి చెందిన దివ్యాంగులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వేడుకల్లో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు, ఎస్పీ రూపేష్, జడ్పీ చైర్‌పర్సన్ పట్లోళ్ల మంజుశ్రీజైపాల్‌రెడ్డి పరిశీలించారు. పోలీసు, మహిళా శిశు సంక్షేమం, మత్స్య, డీఆర్డీఏ, వ్యవసాయ, అటవీ శాఖల స్టాళ్లు ఆకట్టుకున్నాయి.





మెదక్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రదర్శిస్తున్న యోగాసనాలు, సాంస్కృతిక ప్రదర్శన





పోలీసుశాఖ స్టాల్‌లో తుపాకీని పరిశీలిస్తున్న కలెక్టర్, కుమారుడి తలపై పోలీసు టోపిని పెట్టి చిరుదరహసంతో ఎస్పీ రూపేష్ దంపతులు



మెదక్ కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న అదనపు కలెక్టర్లు



మెదక్ కోర్టు ఆవరణలో జెండా ఎగురవేస్తున్న న్యాయాధికారి లక్ష్మీశారద

మువ్వన్నెల రెపరెపలు

ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరణ

మెదక్ అర్బన్, జనవరి 26 : మెదక్ జిల్లా కేంద్రంలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ ఆఫీసులతోపాటు వివిధ పార్టీల కార్యాలయాలు, ఆయా సంఘ భవనాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు వేంకటేశ్వర్లు, రమేష్, కోర్టులో జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద, జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ బాలస్వామి జాతీయ జెండాను ఎగురవేశారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, ఇరిగేషన్ కార్యాలయంలో ఎస్ఈ యేసయ్య, ఎక్సైజ్ కార్యాలయం వద్ద సూపరింటెండెంట్ రజాక్, మత్స్య శాఖ కార్యాలయం వద్ద డీఎఫ్‌వో నరసింహారావు, జిల్లా కేంద్ర ఆసుపత్రి వద్ద డీసీహెచ్ఎస్ డాక్టర్ చంద్రశేఖర్, టీఎన్జీవో భవన్ వద్ద జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్, పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ వెంకటేశ్, మార్కెట్‌యార్డులో ఏఎంసీ చైర్మన్ బట్టి జగపతి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

రెపరెపలాడిన త్రివర్ణపతాకం

సంగారెడ్డి రూరల్, జనవరి 26 : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రభాకర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవవందనం చేశారు. సంగారెడ్డి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. చిన్నారులకు నోట్ బుక్కులను పంపిణీ చేశారు. జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో పతాకాన్ని ఆవిష్కరించి మహాత్మా గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రూపేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అదనపు ఎస్పీ అశోక్, సంగారెడ్డి డీఎస్పీ రమేష్‌కమార్, పోలీసు అధికారులు పాల్గొన్నారు. సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రవీందర్‌రెడ్డి, జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో డీఈవో వెంకటేశ్వర్లు, సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి, కమిషనర్ సుజాత, సంగారెడ్డి ఎమ్మార్వో కార్యాలయంలో తహసీల్దార్ ఫరహీన్‌షేక్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ లావణ్య దుర్గేష్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, డీసీసీబీ బ్యాంకులో చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, డీసీఎంఎస్ కార్యాలయంలో చైర్మన్ శివకుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.



సంగారెడ్డి జడ్పీ కార్యాలయం ఆవరణలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ మంజుశ్రీ



సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఎగురవేసిన జాతీయ జెండా

మాఘమాస జాతరకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జనవరి26: అక్బర్‌పేట- భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి రామలింగేశ్వరాలయం(కూడవెల్లి) మాఘమాస్య జాతరకు ఏర్పాట్లను పూర్తి చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం కూడవెల్లి రామలింగేశ్వరాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా వచ్చే నెల 5 నుంచి ప్రారంభం కానున్న మాఘమాస్య జాతరకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లను చేయాలని సూచించారు. కూడవెల్లి వాగులో పుణ్యస్నానాలు చేసే భక్తుల కోసం ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ చొరవతో కూడవెల్లి జీవనదిగా మారిందన్నారు. ఇటీవల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశానని, అలాగే మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కూడా ప్రభుత్వానికి లేఖ రాయడంతో ప్రభుత్వం రంగనాయకసాగర్, మల్లన్నసాగర్‌లకు నీళ్లను విడుదల చేసిందన్నారు. మాఘస్నానాలకు ఇబ్బందులు లేకుండా, ఏలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే రామేశ్వరంపల్లి గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, గ్రామనాయకులు తదితరులున్నారు.



కూడవెల్లి రామలింగేశ్వరాలయం వద్ద మాఘమాస్య ఏర్పాట్లను పరిశీలిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

శామంతల అనిల్‌కు ఇన్నోవేషన్ అవార్డు

మద్దూరు, జనవరి 26 : మద్దూరు మండలంలోని నర్సాయపల్లి గ్రామానికి చెందిన శామంతల అనిల్ ప్యాడీ స్ప్రింగ్స్ వీడర్ అవిష్కరించినందుకు గానూ ఇంటింటా ఇన్నోవేటర్ విలేజ్ ఇన్నోవేషన్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శామంతల అనిల్‌ను సర్పంచ్ బద్దిపడిగె లలిత ఉపసర్పంచ్, వార్డు సభ్యులు సన్మానించారు.

ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుంది

● సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి

కొండపాక, జనవరి 26 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రభుత్వము తూ.చ. తప్పకుండా అమలు చేస్తుందని మాజీ ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం కుకునూరు పల్లి లో పలువురు బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 రోజుల్లో ఆరుగ్యారెంటీలు అమలు అవుతాయని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో అన్ని స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలిచి తీరుతుందన్నారు. కార్యక్రమంలో కుకునూరుపల్లి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విరుపాక శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిప్యుటేషన్‌పై స్టే పొందిన కొమురవెల్లి ఏఈవో వైరాగ్యం అంజయ్య

● ఉత్తర్వులతో మల్లన్న ఆలయానికి రాక
● కుర్చీలో కూర్చోవడంపై అభ్యంతరం
● కమిషనర్ ఆదేశాలు కావాలని నిరాకరించిన ఈవో

చేర్యాల, జనవరి 26 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయంలో డిప్యూటేషన్‌పై ఏఈవోగా పనిచేస్తున్న వైరాగ్యం అంజయ్యపై ఇటీవల పలు ఆరోపణల రావడంతో దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ స్పందించి మెదక్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. దీన్ని సవాల్‌చేస్తూ అంజయ్య హైకోర్టును ఆశ్రయించి స్టే పొందారు. ఈ మేరకు స్టే ఉత్తర్వులతో శుక్రవారం ఆలయానికి వచ్చి విధుల్లో చేర్చుకోవాలని ఈవో బాలాజీశర్మకు ఉత్తర్వులు అందించి ఏఈవో కుర్చీలో కుర్చున్నాడు. దీంతో తాను రిలీవ్ చేసినందున నేరుగా విధుల్లో చేర్చుకునే అవకాశం లేదని, కోర్టు స్టే ఉత్తర్వులననుసరించి కమిషనర్ కార్యాలయానికి నివేదిక అందిస్తానని, కమిషనర్ ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకుంటానని ఈవో బాలాజీశర్మ తెలిపి, కుర్చీలో కూర్చోకూడదని సూచించడంతో అంజయ్య కార్యాలయం నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయం గమనించిన ఆలయవర్గాలు, స్థానికులు భిన్నరీతిలో స్పందించారు. ఎక్కడికి పంపించినా ఇక్కడే పనిచేయాలని పాకులాడటం ఎందుకుఅని కొందరు, కొన్నినెలలే ఉన్న సర్వీసును కొనసాగిస్తే ఏం అవుతుందని మరికొందరు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేయడం చర్చనీయాంశంగా మారింది.



కార్యాలయ కుర్చీలో కూర్చున్న వైరాగ్యం అంజయ్య

ప్రతీ ఆలోచన వెనుక సైన్స్ ఉంటుంది

● సిద్దిపేటలో శాఖాహారుల మెగా ర్యాలీ

సిద్దిపేట టౌన్, జనవరి 26: ప్రతీ ఆలోచన వెనుక సైన్స్ ఉంటుందని, అలాగే శాఖహారం వెనుక కూడా సైన్స్ దాగి ఉంటుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని కొండ మల్లయ్య గార్డెన్‌లో శాఖాహారుల మెగా ర్యాలీని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఒక శాతం మాత్రమే శాఖాహారులున్నారని, ఈ సంఖ్య పెరిగేందుకు ఒక మంచి కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. మంచి ఆరోగ్యానికి, సాత్విక ఆలోచనలకు శాఖాహారం దోహదపడుతుందని వివరించారు. శాఖాహారుల సంఖ్య పెరిగేలా చూడాలని సూచించారు.



శాఖాహారుల ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

అయోధ్య విశిష్ట అతిథి అరవింద్‌కు అభినందనలు

అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా పాల్గొని, సిద్దిపేటకు వచ్చిన ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ అరవింద్, శుక్రవారం మాజీ మంత్రి హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. అయోధ్యలో స్వీకరించిన సీతారాముల ప్రతిమతో పాటు ప్రసాదాన్ని హరీశ్‌రావుకు అందజేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డాక్టర్ అరవింద్‌ను అభినందించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

నంగునూరు, జనవరి 26: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం నంగునూరు పాలమాకుల గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య, పీఏసీఎస్ చైర్మన్‌లు రమేశ్‌గౌడ్, ఎల్లంకి మహిపాల్ రెడ్డి, సర్పంచ్ కుమార్, ఉపసర్పంచ్ ఓజాల్, నాయకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తా

● పదో తరగతి విద్యార్థుల చదువుపై హరీశ్‌రావు ఆరా

సిద్దిపేట టౌన్, జనవరి 26: త్వరలోనే సిద్దిపేట నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థుల తలిదండ్రులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ఉచితంగా డిజిటల్ కంటెంట్ పుస్తకాలను హరీశ్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఓ విద్యార్థిని అడిగి వారి చదువుకు సంబంధించిన పలు విషయాలపై ఆరా తీశారు.

హరీశ్‌రావు: పొద్దున్నే అమ్మ నిద్ర లేపి చదివిస్తుందా?

విద్యార్థిని: అవును సార్, ఉదయం 5.30 గంటలకు నిద్రలేపి చదువమని చెప్తుంది

హరీశ్‌రావు: నేను పంపిన ఉత్తరం మీ అమ్మ నాన్నలకు అందిందా, టీవీలు బంజేసారా, ఫోన్‌లు చూస్తున్నావా?

విద్యార్థిని: మీరు రాసిన ఉత్తరం అందగానే హరీశన్న లెటర్ రాసి పంపాడు. బాగా చదువుకో అని మా తల్లిదండ్రులు చెప్పారు. పరీక్షలు అయ్యే వరకు టీవీ, ఫోన్‌లు చూడొద్దని చెప్పారు.

హరీశ్‌రావు: కేర్ టీచర్ చదివిస్తున్నారా, అన్నీ చెబుతున్నారా?

విద్యార్థిని: చదివిస్తున్నారు సార్, ఏదైనా డౌట్ ఉంటే కూడా తీరుస్తున్నారు.

హరీశ్‌రావు: నేను మీ అమ్మ నాన్నలకు ఉత్తరం రాసిన. మీకు స్నాక్స్ ఏర్పాటు చేయిస్తున్న. డిజిటల్ కంటెంట్ బుక్స్ ఇస్తున్న. మీ అమ్మనాన్నలతో ఫోన్‌లో మాట్లాడుతా, మరి మీరు అందరు పాస్ కావాలి?

విద్యార్థిని: అలాగే సార్, తప్పకుండా 10 జీపీఏ సాధిస్తాం.

హరీశ్‌రావు: మీరంతా నా పిల్లలుగా నేను ఇంత ప్రయత్నం చేస్తున్నా. మీ భవిష్యత్తు కోసం, మీ తల్లితండ్రులు ఆశయానికి, మీరు చదుకున్న పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆశిస్తున్నా.

విద్యార్థిని: మీరు ప్రోత్సహిస్తున్న తీరు చాలా బాగుంది సార్, మీ కోసం, సిద్దిపేట కోసం, పాఠశాల కోసం తప్పకుండా కృషి చేస్తాం.



పదవతరగతి విద్యార్థినితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఉత్తమ సేవలకు ప్రశంస

● గణతంత్ర వేడుకల సందర్భంగా అధికారులకు అందజేసిన సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



వెల్దుర్తి: మెదక్ కలెక్టర్ రాజర్షిషా చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఏఎస్ఐ వసురాం నాయక్



గణతంత్ర వేడుకల్లో నృత్య ప్రదర్శనలు తిలకిస్తున్న జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు, కలెక్టర్, ఎస్పీ, జడ్పీ చైర్‌పర్సన్

సంగారెడ్డి టౌన్, జనవరి 26: జిల్లాలోని ఆయా ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన పలువురు అధికారులు, ఉద్యోగులకు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రశంసాపత్రాలను అందజేశారు. సంగారెడ్డిలోని పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లాలోని ఆయా ప్రభుత్వ శాఖలకు చెందిన 93 మంది అధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లా ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్, జడ్పీ సీఈవో సీహెచ్.ఎల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్, డీఆర్‌డీవో శ్రీనివాసరావు, డీఆర్‌వో



సంగారెడ్డి టౌన్: గణతంత్ర వేడుకల్లో స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

మెంచు నగేశ్, డీపీఆర్‌వో విజయలక్ష్మి, సివిల్ సప్లయ్ మేనేజర్ సుగుణ బాయి, వ్యవసాయ శాఖ అధికారి నరసింహారావు, ఆర్డీవోలు పాండు, రవీంద ర్‌రెడ్డి, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, జిల్లా పరిషత్, అటవీ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఉద్యోగులు ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

కలెక్టర్ తేనీటీ విందు

75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి సంగారెడ్డిలోని కలెక్టర్ వల్లూరు కాంత్రి తన క్యాంపు కార్యాలయంలో తేనీటీ విందును ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు, ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో మెంచు నగేశ్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ ఫర్హీన్ షేక్, మున్సిపల్ కమిషనర్ సుజాత, పలువురు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరయ్యారు.

ఉత్తమ సేవలకు ప్రశంస

మెదక్ అర్బన్, జనవరి 26: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన వివిధ శాఖల ఉద్యోగులకు 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో జడ్పీ చైర్‌పర్సన్ హేమలత, కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, ఎస్పీ బాలస్వామి, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్‌చేతుల మీదుగా ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.



మెదక్ అర్బన్: గణతంత్ర వేడుకల సందర్భంగా ఆయా శాఖల్లో ఉత్తమ సేవా అవార్డులు అందుకుంటున్న మెదక్ జిల్లాలోని వివిధ శాఖ ఉద్యోగులు

ఉత్తమ సేవలకు గుర్తింపు

వెల్దుర్తి, జనవరి 26: వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ వసురాం నాయక్, కానిస్టేబుల్ రామయ్య, రిసెప్షన్ అధికారి సుకన్యలు చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఏఎస్ఐ వసురాంనాయక్‌కు అతిఉత్క్రిష్ట, కానిస్టేబుల్ రామయ్యలకు ఉత్క్రిష్ట సేవ పతకాలను, మెదక్ జిల్లా ఉత్తమ రిసెప్షన్ సిబ్బందిగా సుకన్యకు శుక్రవారం మెదక్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా అవార్డులను అందజేశారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఆర్సీవోగా భీమయ్య

జోగిపేట, జనవరి 26: సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న మెదక్ వెస్ట్ రీజియన్ కోఆర్డినేటర్ భీమయ్య రాష్ట్రస్థాయి ఉత్తమ ఆర్సీవోగా ఎంపికయ్యారు. శుక్రవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి నవీన్ నికోలస్ హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో భీమయ్యకు ఉత్తమ ఆర్సీవో అవార్డును అందజేయడంతో పాటు, జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా అందోలులోని గురుకుల పాఠశాలతో పాటు, రీజియన్ పరిధిలోని అన్ని సోషల్ వెల్ఫేర్ గురుకులాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయ బృందాలు, భీమయ్యను శాలువాలు, పూలమాలలతో సత్కరించి, అభినందించారు.



జోగిపేట: రాష్ట్రస్థాయి అవార్డు స్వీకరిస్తున్న భీమయ్య

గణతంత్ర వేడుకల్లో భాగంగా జిల్లా సంగారెడ్డి ఎస్పీ రూపేష్‌కు, అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్‌కు, వివిధశాఖల అధికారులకు ఉత్తమ సేవ ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి







తూప్రాన్‌లో మున్సిపల్ అవిశ్వాసానికి క్యాంపులు

● రెండు వర్గాలుగా వేర్వేరుగా క్యాంపులకు

● ఒక్కటైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు



తూప్రాన్, జనవరి 26: తూప్రాన్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమతున్నారు. రాజకీయ పక్షాలు పావులు కదుపుతుండటంతో క్యాంపు రాజకీయాలకు తెరతీశారు. చైర్మన్ పదవి నుంచి గద్దె దించేందుకు శతృపక్షాలు ఒక్కటయ్యాయి. రాజకీయ పార్టీల ప్రధానం కాకుండా కేవలం చైర్మన్‌ను గద్దె దించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. తూప్రాన్ మున్సిపల్‌లో 16 మంది కౌన్సిలర్లు ఉండగా రెండు వర్గాలుగా విడిపోయి క్యాంపులకు వెళ్లిపోయారు. చైర్మన్ రాఘవేందర్‌గౌడ్ (రవీందర్‌గౌడ్) ఒంటెద్దు పోకడలను నిరసిస్తూ అవిశ్వాసం పెడుతున్నట్లు పేర్కొంటున్నారు. బీఆర్ఎస్‌కు స్వతంత్రులతో కలిసి 13 మంది కౌన్సిలర్లు ఉండగా, ఇద్దరు కాంగ్రెస్, ఒకరు బీజేపీ కౌన్సిలర్లు ఉన్నారు. 13 మంది మెజారిటీ ఉండటంతో బీఆర్ఎస్‌కు చెందిన రాఘవేందర్‌గౌడ్ చైర్మన్, నందాల శ్రీనివాస్ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. చైర్మన్ సహకరించడం లేదంటూ కొంతకాలంగా బీఆర్ఎస్‌కు చెందిన కొందరు కౌన్సిలర్లు దూరంగా ఉంటున్నారు. చైర్మన్ అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ఓ బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఇలా కొనసాగుతుండగానే అసెంబ్లీ ఎన్నికలు జరగడం, ప్రభుత్వం మారిపోవడంతో అవిశ్వాస వ్యవహారం తెరమీదకు వచ్చింది. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి రంగంలోకి రావడంతో వ్యవహారం మరింత ముదిరిపోయింది. బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఏడుగురు అవిశ్వాసం పెట్టేందుకు సై అనడంతో, కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు, బీజేపీకి చెందిన ఒక్కరు మద్దతు తెలపడంతో కౌన్సిలర్ల సంఖ్య పదికి చేరింది. దాంతో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో అవిశ్వాసం పెట్టేందుకు కౌన్సిలర్లు మామిండ్ల జ్యోతి, చెలిమెల ప్రియాంక, పల్లెర్ల జ్యోతి, జిన్న భగవాన్‌రెడ్డి, రాజు, రవీందర్‌రెడ్డి, లక్ష్మీబాయి, నందాల శ్రీనివాస్, శ్రీశైలంగౌడ్, నారాయణగుప్తా ముందుకు రావడంతో క్యాంపు రాజకీయాలు మొదలుపెట్టారు. బుధవారం నుంచి క్యాంపు నిర్వహిస్తున్నట్లు సమాచారం. చైర్మన్ రవీందర్‌గౌడ్ సైతం వెంకటేశ్, ఉమాసత్యలింగం, అరుణ వెంకట్‌గౌడ్, తలారి పద్మ, లావణ్య దుర్గారెడ్డితో క్యాంపు నిర్వహిస్తున్నారు. అవిశ్వాసం పెట్టేందుకు 10 మంది కౌన్సిలర్లు ఉండటంతో అవసరమైన మరో కౌన్సిలర్ మద్దతు కోసం ప్రయత్నాలు చేపట్టారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు తూప్రాన్ మున్సిపల్‌లో ఒక్కటై అవిశ్వాసం పెట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగుతున్నారు. ఒకటి రెండురోజుల్లో అవిశ్వాసం వ్యవహారం కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నదని చెబుతున్నారు. చైర్మన్ నిర్వహిస్తున్న క్యాంపునకు వెళ్లిన కౌన్సిలర్లలో ఒకరిద్దరి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయబోతున్నట్లు సమాచారం. కౌన్సిలర్లను కిడ్నాప్ చేసినట్లు ఫిర్యాదు చేసే అవకాశం కనిపిస్తున్నది. ఏదీ ఏమైన తూప్రాన్ మున్సిపల్ రాజకీయ రసవత్తరంగా తయారైందని చెప్పొచ్చు.

రేపు కొమురవెల్లి మల్లన్న లష్కర్‌వారం

● నేటి సాయంత్రం కొమురవెల్లికి చేరుకోనున్న సికింద్రాబాద్ భక్తులు



కొమురవెల్లి మల్లన్న

చేర్యాల, జనవరి 26: ప్రముఖ శైవక్షేత్రం కొమరవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా రేపటి నుంచి లష్కర్‌వారం ప్రారంభం కానున్నది. సంక్రాంతి పర్వదినం తరువాత వచ్చే మొదటి ఆదివారాన్ని పట్నంవారంగా, రెండో ఆదివారాన్ని లష్కర్ వారంగా పిలుస్తారు. సికింద్రాబాద్‌కు చెందిన వేలాదిమంది భక్తులు మల్లన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తుండటంతో లష్కర్‌వారంగా పిలుస్తుంటారు. శనివారం సాయంత్రానికి ఇంటిల్లిపాదిగా కొమురవెల్లికి చేరుకుని మల్లన్నను ధూళి, దర్శనం చేసుకుంటారు. ఆదివారం మల్లన్నకు పట్నాలు వేసి ఎల్లమ్మతల్లికి బోనాలు నివేదించనున్నారు. ఈ మేరకు ఆలయవర్గాలు, పోలీసులు ఇటీవల ముగిసిన పట్నంవారం ఏర్పాట్లలో నెలకొన్న లోటుపాట్లు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.

ఎండు గంజాయి స్వాధీనం



ఎక్సైజ్ పోలీసుల అదుపులో పాషా

మెదక్ అర్బన్, జనవరి 26: ఎండు గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ రజాక్ తెలిపారు. పట్టణంలోని రాంనగర్ కాలనీకి చెందిన పాషా ఇంటిపై ఈఐ నరేందర్ బృందం ఆధ్వర్యంలో దాడులు చేశారు. కాగా అతని వద్ద నుంచి 150 గ్రాములు ఎండు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. పాషాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఈఎస్ వెల్లడించారు.

పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వం

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

జహీరాబాద్, జనవరి 26: పెట్టుబడిదారులకు కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాస్తున్నదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని మహీంద్రా కర్మాగారంలో నిర్వహించిన యూనియన్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదన్నారు. కార్మికుల చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకువచ్చి పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్నదని చెప్పారు. కార్మికచట్టాలు, లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలని, లేనిపక్షంలో ఉత్పత్తులను స్తంభింపజేసి పెద్దఎత్తున ఆందోళనలు, ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్మికులు, కార్మికసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కర్మాగారంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కరాములు, తదితరులు

బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలు

సంగారెడ్డి రూరల్, జనవరి 26: బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీసాయిలు, ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకుడు రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా శుక్రవారం కార్మిక, ప్రజాసంఘాల నాయకులు సంగారెడ్డిలోని ఐబీఐ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లయినా ఇప్పటివరకు ప్రజలు, రైతులు, కార్మికులకు ఏమి చేయలేదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న నిర్వహించే దేశవ్యాప్తం సమ్మెలో అన్నివర్గాల వారు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు జయరాజ్, నర్సింహులు, నాయకులు యాదగిరి, బాబురావు, రాజయ్య, శివశంకర్, కృష్ణ, అశోక్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య

● ఘటనా స్థలంలోనే మృతురాలి కుమారుడికి గుండెపోటు

● సీపీఆర్ నిర్వహించి కాపాడిన ఏఎస్ఐ రాజు

హవేళిఘణపూర్, జనవరి 26: జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య చేసుకున్నది. హవేళిఘణపూర్ మండలం శమ్నాపూర్ గ్రామానికి చెందిన చింతల దుర్గవ్వ(70) వారం రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నది. అయితే గురువారం కుటుంబీకులతో భోజనం చేసి నిద్రించింది. శుక్రవారం ఉదయం లేచిచూడగా దుర్గవ్వ కనిపించలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతకగా.. గ్రామంలోని సర్కారు బావిలో శవమై కనిపించింది. అది చూసిన కొడుకు భైరయ్యకు ఘటనా స్థలంలోనే గుండెపోటు వచ్చింది. పక్కనే ఉన్న హవేళిఘణపూర్ ఏఎస్ఐ రాజు భైరయ్యకు సీపీఆర్ చేయడంతో కోలుకున్నాడు. భైరయ్యను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతురాలి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాజు తెలిపారు.



భైరయ్యకు సీపీఆర్ నిర్వహిస్తున్న ఏఎస్ఐ రాజు

కొల్గూరులో మహిళ హత్య

● ఇంట్లోకి చొరబడి నగలను అపహరించుకుపోయిన అగంతకుడు

● ఘటనా స్థలాన్ని పరిశీలించిన సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ



గజ్వేల్ మండలం కొల్గూరులో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ అనురాధ



శ్యామల(ఫైల్)

గజ్వేల్, జనవరి 26: గజ్వేల్ మండలం కొల్గూరులో మహిళ హత్యకు గురైంది. గ్రామానికి చెందిన చెన్న శ్యామల(55) కిరాణ దుకాణం నిర్వహిస్తూ తన భర్త శ్రీనివాస్‌తో కలిసి జీవిస్తున్నది. శుక్రవారం ఉదయం 5 గంటలకు శ్యామల ఇంటి ఆవరణలోని వాష్‌రూమ్‌కు వెళ్లింది. అది గమనించిన ఆగంతకుడు శ్యామల భర్త శ్రీనివాస్ పడుకున్న బెడ్‌రూంకు గడియ పెట్టాడు. అనంతరం వాష్‌రూమ్ నుంచి శ్యామల బయటకు రాగానే గట్టిగా పట్టుకుని దిండుతో ముఖంపై గట్టిగా ఒత్తడంతో శ్యామల స్పృహ తప్పింది. వెంటనే ఆమె మెడలోని పుస్తెల తాడు, చెవి కమ్మలు తీసుకుని పారిపోయాడు. అనంతరం స్పృహలోకి వచ్చిన శ్యామల నెమ్మదిగా గడియ తీసి జరిగిన ఘటనను భర్తకు చెప్పింది. వెంటనే శ్రీనివాస్ చుట్టుపక్కల వారికి తెలిపాడు. శ్యామలను గజ్వేల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉన్నదని, వెంటనే హైదరాబాద్‌కు తరలించాలని అక్కడి వైద్యులు సూచించడంతో అక్కడి నుంచి వేరే ఆస్పత్రికి తరలించగా అప్పటికే శ్యామల మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. భర్త శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. శ్యామల హత్య విషయం తెలుసుకున్న ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కాగా ఘటనా స్థలాన్ని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ పరిశీలించారు. అదనపు డీసీపీ అందె శ్రీనివాస్‌రావు, గజ్వేల్ ఏసీపీ మడత రమేశ్, గజ్వేల్ సీఐ జాన్‌రెడ్డిలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేసి ఛేదించాలని గజ్వేల్ ఏసీపీ రమేశ్, సీఐ జాన్‌రెడ్డిలకు ఆదేశాలిచ్చారు. గజ్వేల్ మార్చురీలో శ్యామల మృతదేహాన్ని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పరిశీలించారు. వారితో గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, కొల్గూరు ఎంపీటీసీ జ్యోతిస్వామి ఉన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

వెల్దుర్తి, జనవరి 26: జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వెల్దుర్తి మండలం ఎల్కపల్లి గ్రామానికి చెందిన కానికే వెంకటేశం(45) మద్యానికి బానిసై ఎలాంటి పనులు చేసేవాడు కాదు. రెండురోజుల క్రితం పనుల నిమిత్తం వెంకటేష్ కుటుంబసభ్యులు ఊరికి వెళ్లారు. కాగా గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మృతుడి కుమారుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మధుసూదన్‌గౌడ్ తెలిపారు.

కుటుంబ కలహాలతో...

ములుగు, జనవరి 26: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. బైలంపూర్ ఆర్అండ్‌ఆర్ కాలనీకి చెందిన గువ్వ నరేష్(30) కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురయ్యాడు. గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య లత, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ వివరించారు.

త్రివర్ణ శోభితం

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, జనవరి 26: సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, రాజకీయ పార్టీల కార్యాలయాలు, ప్రజాసంఘాల కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఎగురవేసి, సంబురాలు నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ అంబేడ్కర్ కృషితో భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిందని గుర్తు చేసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


జహీరాబాద్ క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు


మెదక్ ఖిల్లాపై జెండాను ఎగురవేసిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్


నారాయణఖేడ్‌లో ఇందిరా చౌక్ వద్ద జెండావందనం చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి


తెల్లాపూర్‌లో అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


నర్సాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జెండావందనం చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి


పుల్‌కల్‌లో ఎంపీపీ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేస్తున్న ఎంపీడీవో జయలక్ష్మి


జాతీయ జెండా రంగులతో భక్తులకు దర్శనమిస్తున్న ఏడుపాయల వనదుర్గమ్మ


హత్నూర తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండావందనం చేస్తున్న అధికారులు, నాయకులు


పెద్దశంకరంపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద జెండాను ఎగురవేస్తున్న ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా


వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేసిన తహసీల్దార్ తులసీరామ్


తూప్రాన్‌లో జెండాను ఎగురవేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి


అందోలు ఆర్డీవో కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఆర్డీవో పాండు


కోహీర్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండా వందనం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


రాయికోడ్ ఎంపీడీవో కార్యాలయం వద్ద గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు


రామాయంపేటలోని వివేకానంద పాఠశాలలో డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు


నాగల్‌గిద్ద తహసీల్దార్ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు


నార్సింగి మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేసిన ఎంపీపీ చిందం సబిత


వట్‌పల్లి మండలం కేరూర్‌లో విద్యార్థులకు నోట్‌బుక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు



మెదక్‌లో బహుమతులను అందజేస్తున్న సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ చౌదరి, ప్రిన్సిపల్ సంధ్యారాణి


జిన్నారంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న తహసీల్దార్ రవికుమార్, రెవెన్యూ సిబ్బంది


సదాశివపేటలో జాతీయ జెండాను ఎగురవేసిన కౌన్సిలర్ పులిమామిడి రాజు


చేగుంట మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేసిన ఎంపీపీ మాసుల శ్రీనివాస్


కంగ్టిలో అంబేడ్కర్ చిత్రపటానికి మంగళహారతి పడుతున్న తహసీల్దార్ విష్ణుసాగర్


నిజాంపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు


మాసాయిపేట ప్రభుత్వ పాఠశాలలో ప్రజాప్రతినిధులు, అధికారులకు సెల్యూట్ చేస్తున్న విద్యార్థులు


కౌడిపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద జెండాను ఎగురవేస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్


రేగోడు తహసీల్ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేస్తున్న తహసీల్దార్

ధాన్యం పరిశ్రమకు నోటీసులు

మాసాయిపేట, జనవరి 26: మాసాయిపేటలో గల ధాన్యం పరిశ్రమకు తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీ రామాయంపేట మార్కెటింగ్ శాఖ నోటీసులు జారీ చేసింది. మాసాయిపేటలో ఉన్న పర్వతవర్ధిని పౌల్ట్రీ పరిశ్రమ తెలంగాణ వ్యవసాయ మార్కెట్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కొన్నేళ్లుగా రైతుల నుంచి అక్రమంగా ధాన్యం కొనుగోలు చేస్తూ వ్యాపారం నిర్వహిస్తున్నది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు కట్టకుండా ఎగవేస్తున్నది. దీంతో సంబంధిత మార్కెటింగ్ శాఖ రామాయంపేట కార్యదర్శి జ్ఞానేశ్వర్ శుక్రవారం నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లోగా అనుమతులు తీసుకోవాలని లేదంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సాంగోళి రాయన్న వర్ధంతి

నారాయణఖేడ్, జనవరి 26: మండల పరిధిలోని రుద్రారంలో శుక్రవారం కురుమ సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు సాంగోళి రాయన్న వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ భూంగొండ, కురుమ సంఘం నాయకులు మారుతి, అడవిగొండ, విష్ణు, ప్రవీణ్, సురేష్, జ్ఞానేశ్వర్, మాణిక్‌గొండ, తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు

మాసాయిపేట, జనవరి 26: మండలంలోని బొమ్మారం రైల్వే అండర్ బ్రిడ్జి పనులు నాలుగు సంవత్సరాలుగా నత్తనడకన కొనసాగుతున్నాయి. దీంతో 40 గ్రామాల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. 2019లో ప్రారంభమైన 232 అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. రైల్వేగేట్ నంబర్ 232-బొమ్మారం ద్వారా బొమ్మారం, నాగ్సాన్‌పల్లి, కొప్పులపల్లి, హస్తాల్పూర్, వెల్దుర్తి మండలంలోని 33 గ్రామాలతో పాటు శంకరంపేట మండలంలోని గ్రామాలకు నిత్యం రాకపోకలు జరిగేవి. రైల్వే గేట్ల వద్ద ప్రమాదాలను అరికట్టడానికి అండర్‌బ్రిడ్జి పాసేజులుగా మారుస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. బొమ్మారం వద్ద 2019లో చేపట్టిన పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నాలుగేళ్లుగా నత్తనడకన కొనసాగుతున్నాయి. దీంతో 40 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.


బొమ్మారం వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన అండర్‌బ్రిడ్జి నిర్మాణ పనులు

కాలయాపన కోసమే ప్రజాపాలన దరఖాస్తులు

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట, జనవరి 26: కాలయాపన కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి విమర్శించారు. శుక్రవారం శివ్వంపేట మండలం కొత్తపేట గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. సర్పంచ్ సాన్విరమాకాంత్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు, వాలీబాల్ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే సునీతారెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ.. సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్య పెడుతున్నదని విమర్శించారు. రైతుబంధు ఇంకా పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో రైతులు నాట్లు వేయడానికి ఆలస్యమవుతున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హరికృష్ణ, జడ్పీటీసీ మహేష్‌గుప్తా,జడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, నాయకులు చంద్రాగౌడ్, రమణాగౌడ్, వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, యాదాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ కస్టమర్ సర్వీస్ సెంటర్ ప్రారంభం

నర్సాపూర్: నర్సాపూర్ పీఏసీఎస్ కార్యాలయం వద్ద రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి ఏర్పాటు చేసిన సర్వీస్ సెంటర్‌ను ఎమ్మెల్యే సునీతారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు మెరుగైన సేవలు సత్వరమే అందేందుకు ఈ సెంటర్ దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు నర్సింగ్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శేఖర్, నాయకులు జగదీష్, జ్ఞానేశ్వర్, గొర్రె వెంకట్‌రెడ్డి, కృపాచారి, హుస్సేన్, సాగర్, రింగుల ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


నర్సాపూర్‌లో పీఏసీఎస్ సర్వీసు సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే సునీతారెడ్డి

పరిశ్రమల సహకారంతో అభివృద్ధి

జిన్నారం, జనవరి 26: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో పరిశ్రమల సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కాజీపల్లిలో న్యూ లాండ్ పరిశ్రమ సహకారంతో రూ.30లక్షల అంచనాతో జీఎంఆర్ కాలనీలో నిర్మించనున్న వాటర్‌ట్యాంకు పనులకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక వాడలతో పాటు గ్రామాల అభివృద్ధికి పరిశ్రమల యాజమాన్యాలు సహకారం అందించాలని కోరారు. నూతన పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి కోసం తరలి వచ్చి స్థానికంగా నివాసముంటున్న వారి ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ భార్గవ, న్యూ లాండ్ పరిశ్రమ ప్రతినిధులు డీ.వీ.రెడ్డి. రామకృష్ణ, రవి, కృష్ణమోహన్, సురేష్, ఉప సర్పంచ్ ఆంజనేయులు, నాయకులు రాజేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ నిధులతో పాఠశాలలకు పరికరాలు

రేగోడు జనవరి 26: విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఆధునిక సైన్స్ అండ్ టెక్నాలజీని అందించేందుకు రేగోడు మండలంలోని ఉన్నత పాఠశాలలకు, మోడల్ పాఠశాలలకు జడ్పీ నిధులతో సైన్స్ అండ్ కంప్యూటర్ పరికరాలను మంజూరు చేసినట్లు జడ్పీటీసీ యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం రేగోడు మోడల్ పాఠశాల, ఉన్నత పాఠశాలతో పాటు జగిర్యాల, టి లింగంపల్లి, గజవాడ పాఠశాలలకు ఆ పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్‌ను స్వాధీనం చేసుకోవాలి

- లేఖల ద్వారా సీఎంకు ఎమ్మార్పీఎస్ నాయకుల విజ్ఞప్తి


ముఖ్యమంత్రికి రాసిన లేఖలను చూపుతున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

మెదక్, జనవరి 26: మెదక్‌లో నిబంధనలకు విరుద్ధంగా బినామీలతో కొనసాగిస్తున్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, అర్హులకు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డుల ద్వారా లేఖలు రాశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు బాలరాజ్ మాట్లాడుతూ.. సంవత్సరం క్రితం మున్సిపల్ దుకాణాలను కేటాయిస్తున్నామంటూ అధికారులు ఒక్కొక్కరి వద్ద రూ.40 వేలు చొప్పున డిపాజిట్లు వసూలు చేశారని ఆరోపించారు. కానీ మున్సిపల్ అధికారులు ఓ వ్యాపారవేత్తకు 15 షాపులు కట్టబెట్టారని ఆరోపించారు. దర్యాప్తు జరిపి దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించాలని, పట్టణంలో దళిత, నిరుపేద వర్గాలకు స్వయం ఉపాధి కింద దుకాణాలను కేటాయించాలని సీఎంకు రాసిన లేఖల ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రవీణ్, ప్రభాకర్, లక్ష్మణ్, రాములు, నాగరాజ్, సురేష్, ఆనంద్, జగదీష్, సుధాకర్, అరవింద్, కృష్ణ, మహేష్, సుందర్ పాల్గొన్నారు.

గొల్లపల్లిలో మల్లికార్జునస్వామి రథోత్సవం

నర్సాపూర్, జనవరి 26: నర్సాపూర్ మండలం గొల్లపల్లిలో కొనసాగుతున్న మల్లికార్జునస్వామి ఆలయ ఉత్సవాల సందర్భంగా శుక్రవారం రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక భక్తులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు